# కుండ బద్దలు కొడత

అది పెద్ద ఊరు. ఊరి మధ్యన ఖాళీ స్థలంలో రాతి స్థంభం. దాని చుట్టూరా అరుగు, ఓవైపు చింత చెట్టు. మరోవైపు వేప చెట్టు. దసరా రోజు ఇక్కడ పందిళ్ళు వేసి గొర్రెను నరుకుతారు. కాముని పండగ రోజున ఇక్కడ కామున్ని కాలుస్తారు. స్వరాజ్యం వచ్చిన్నుండీ పదిహేను ఆగస్టున, ఇర్వై ఆరు జనవరిన ఇక్కడ జండా ఎత్తుతారు. అందరూ ఆస్థలాన్ని 'జండా కాడ' అంటారు. గ్రామంలోని అన్ని సమస్యలకు ఇక్కడే పరిష్కారం జరుగుతుంది. ప్రతి పంచాయితీకి సంబంధించిన వాదోపవాదాలు జరుగుతాయి. ఆ రోజు జరిగే పంచాయితీకి జనం చాలా మంది వచ్చారు. పొద్దు బారెడెక్కింది. సూర్యునిలో చురుకుదనం. ఎండలో వెచ్చదనం పెరుగుతుంది. పాతికేళ్ళ రంగమ్మ, అర్వై ఏళ్ళ ముదుసలి అత్త ఇద్దరూ ఎండలోనే నిల్చున్నారు. దూరంలో ఆమె భర్త రాములు తల వంచి కూర్చుని, నేల మీద గీతలు గీస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

అనాడు రాముడికొచ్చిన ఆపదలాంటిదే ఈనాడు ఈ రాములికొచ్చింది. రెండూ ఆడవాళ్ళకు జరిగిన అన్యాయాలే. రెండూ అడవిలో జరిగిన అక్రమాలే. రాముడికి రాములుకు మధ్యన ఎన్నో తరాల అంతరం వున్నా, సమస్య ఇంకా సజీవంగానే వుంది. రాములుకు తన తండ్రి గుర్తొచ్చాడు.

పదిహేనేళ్ళ క్రింద తన తండ్రి, తాటి మీదనుండి పడి చనిపోగా, తల్లి బలవంతాన తాళ్ళు ఎక్కడం నేర్చుకుని, నాటి నుండి నేటి వరకు తాళ్ళెక్కుతూ, కల్లును, ముంజలను, గేగులను అమ్ముకొని ఇద్దరు చెల్లెల్ల పెళ్ళి చేసి తనూ పెళ్ళి చేసుకున్నాడు. తిన్నా, తినకున్నా, ఉన్నా లేకున్నా, తల్లి ఆదరణతో, భార్య అనురాగంతో, చక్కగా, చల్లగా సాగుతున్న సంసారంలో చిచ్చు లేపారు.

పొద్దున తాళ్ళెక్కడానికి వెళ్ళి, సందకాడ తిరిగొచ్చేవరకూ నమ్మకంలేని దినదిన గండం బతుకులో, నిప్పులెందుకు పోసింద్రో రాములుకు అర్థం కాలేదు. అమ్మ సెప్పదు, భార్య సూపియ్యదు. ఎవరు తన భార్యపై చెయ్యేసింది అనుకుంటూ చుట్టూ చూశాడు. అందరూ తననే చూస్తున్నట్టు అనిపించింది.

" సెప్పే సెప్పు ! లేకపోతే నిన్ను నరికేస్తా " భార్య వైపే చూస్తూ అన్నాడు. ఒక్కసారే అందరూ అతనివైపు చూశారు. భర్త మాటలు ప్రతి అణువుని కంపరమెత్తించగా, ఆమెకు పొంగివస్తున్న దుఃఖాన్ని మింగుతూ, చీర కొంగును నోటిలో కుక్కుకుని అత్త వైపు జరిగింది.

కోడలి తల నిమురుతూ "అన్నెంపున్నెం ఎరుగని నీకు సీతమ్మ సెరొచ్చె గదనే. ఏడవకు, జరిగింది జరిగినట్లు సెప్పు" అంది అత్త. అత్త స్పర్శతో ఆమె కొత్త శక్తిని పుంజుకొని -

"ఇద్దరు కల్లుకని వచ్చిండ్రు. కల్లు మాట్లాడుకొని తాగిండ్రు. కోడి కూర తెచ్చుకొని తిన్నరు. ఇగ పొయ్యే ముంగల ..." దుఃఖంతో గొంతు పెగల్లేదు రంగమ్మకు. అంత వరకూ వింటున్న జనం ఒక్కసారే శ్వాస పీల్చారు.

అది విన్న రాములు ఒక్కసారే లాగి విడిచిన బాణంలా నిలుచున్నాడు. అతని కనుగుడ్లు రక్తాన్ని చిమ్ముతున్నాయ్. అది చూసిన ఆ ఊరి పెద్ద గొల్ల -

"తొందర పడకు, ఇటురా నీడకు" అంటూ రాముల్ని నీడకు తీసుకొచ్చాడు.

రంగమ్మకు తన భర్త చూపుల్లో కోపం, కసి కనిపించింది. తన నోట్లో కొబ్బరి, బెల్లం పెట్టి నోరు మూసి నవ్వుతూ చూసిన చూపుకు, జిట్టీత పండ్లు తిను, ముత్యాల కొడుకులు పుడతరు అంటూ తన వళ్లో ఈత పండ్లు పోస్తూ చూసిన చూపుకు ఎంత తేడా అనుకుంటూ మళ్లీ చెప్పసాగింది వణుక్కుంటూ.

"అప్పుడాయన తాడు దిగి వాగెమ్మటొస్తుండు. గడ్డ మీద నిలబడి ఒకడు అటు చూస్తుండు. ఇంకొకడేమో నా కోక బట్టి గుంజి, రైక ముడి విప్పి .........." చెప్పడం ఆపింది రంగమ్మ దుఃఖంతో కుమిలిపోతూ.

"ఆ యిప్పి....." అని పెద్ద రెడ్డి రంగమ్మను చూసిన చూపుతో అక్కడున్న పెద్దలందరూ చూపు కలిపారు. సరిగ్గా వాళ్ళ చూపు తన ప్రాతివత్యాన్ని రుజువు చేసికోవడం కోసం సతీ అనసూయను నగ్నంగా వడ్డించమన్నప్పటి మన త్రిమూర్తుల చూపులాగుంది.

":సూపించు ఏంచేసిండ్రో యిప్పి ఈ లోకానికి సూపించు. అందరీక్క అక్కచెల్లెండ్లున్నరు" అంది అత్త రంగమ్మ ముఖంలోకి చూస్తూ.

తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఆమె చూపించలేక మళ్లీ తల వంచుకొని ఏడుస్తుంది. ఆమె కళ్ళ నిండా నీళ్ళు, ముక్కుల్లో తడి.

"పోయినేడు ఓట్లు ఏయ్యలేదని తాళ్ళ గెలలన్నీ కోసేసి మా నోట్లో మన్ను బోస్తిరి. మాకేముంది ? తాటి చెట్టునే నమ్ముకున్న మేము దాని మీదే ఆధారపడితిమి. తాడు మాకు తల్లి. కల్లు దాందే, నార దాందే, తాగే రేఖ దాందే, ఉండే గుడిసె దాని నివాసమే. ఇన్ని ముంజలమ్ముకొనో, ఇన్ని గేగులమ్ముకొనో మా బతుకు మేం బతుకుతుంటే మీకెందుకింత పగ ? మీ భూముల పంచియ్యమంటిమా ? చెట్ల రకం ఎగ్గొడితిమా ? అట్ల చేసి అట్ల బతకనియ్యనైతిరి. ఇయ్యాలనేమో ఇట్ల చేస్తిరి. మరి ఊళ్ళ వుండాల్న, పోవాల్న, మనం నోరు మూసుకుంటే ఇట్ల చేస్తరు. సుపియి, సుపియి" అంది కోడలి ముఖంలోకి చూస్తూ.

అత్త మొండి ధైర్యం ఆమె గుండె నిండా నిండుకోగా చూపుల్లో తెగింపు చోటు చేసికొంది. అత్త కళ్ళలో నుండి ఏదో ధైర్యం రంగమ్మ కళ్ళలోకి చొచ్చుకొని పోగా కొత్త

శక్తి, సత్తువతో ఆమె కొంగు తొలగించి రవిక ముడి విప్పి గ్రామ పెద్దలకు చూపించింది.

భర్త కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నవి.

అత్త గుండెల్లో అగ్గి రగిలి ముఖంలో రోషం సెగలు పొగలుగా పొంగుతుంది.

గ్రామ పెద్దలు ఆమె ఎద మీద కొరికిన కాట్లను చూశారే కానీ, ఎదలోని బాధని, వేదనని అంత గ్రహించినట్లు లేరు. కౌరవసభలో ఆనాడు ద్రౌపదిని చూసినట్లు ఈనాడు రంగమ్మను చూస్తున్నారు.

భయంతో వణుకుతున్న చేతులతో దుఃఖంతో అదురుతున్న పెదాలను మూసుకుంటూ " నేను తప్పించుకొనేందుకు చూసిన, అయినా అదిమిపట్టి రవికను సింపి నోటితో కరిసిండు" అంటూ భోరన ఏడ్చింది ఒక్కసారె.

రాములునెవరో కొరడాతో కొట్టినట్లనిపించింది. గుండెల్లోని బాధ కన్నుల్లోకి తన్నుకు రాగా చుట్టూ చూసి పళ్ళు పటపట కొరికాడు.

"అంతలోనే ఆయన వస్తున్న చప్పుడైంది. ఒక్కసారే కేకేసిన, మరీ దగ్గరికొచ్చిన ఆయన్ని చూసి ఉర్కిన్రు " అంటూ తన ఒంటి గాయాలను చిరిగిన కొంగుతో కప్పుకుంది.

"ఇది ఏమి అన్యాయం ? యిగ జెప్పుండ్రి ఏంన్నాయం చెపుతారో " అంది అత్త.

"బాగా తిని దున్న పోతులా తిరిగితే ఎట్లా ? మంది సంసారాలను కూడా చూడాలి" జనంలోనుండి ఓ గొంతు.

"కన్ను మిన్ను గానకుండా తాగితే ఎట్లా ? దాన్ని మనం తాగుమా ? అది మనల తాగుద్దా ? "మరో గొంతు ఆవేశంతో.

కొంగు జారి, రవికె చినిగి రాబందులు పొడిచిన శవంలా వుంది రంగమ్మ. తాగినోళ్ళంతా మంది పెండ్లాల గుంజుతుండ్రా ఓ ముసలమ్మ.

" చెప్పుండ్రి, చెట్టంత కొడుక్కి ఈ బదనాము ఏంది ? " అంది అత్త.

"ఇంతకూ ఆపని చేసిందెవరు ? అన్ని సూపియ్యరేమి ? "

"అదే అంటున్నం మేం. తప్పు గూర్చే చెపుతున్నరు కానీ ఆ తప్పు చేసిందెవ్వరో చెప్పరేమి ? " అన్నారు మరికొందరు.

ఎవరైందీ తనకు తెలిసినా కోడలి ద్వారా చెప్పించాలని అత్త ఆరాటం. రంగమగమ బిక్కు బిక్కు మంటూ అందరి వైపూ చూసింది.

వాళ్ళిద్దరూ కనిపించలేదు. చుట్టూ మరోసారి కలియచూసింది. లేరు. తల దించుకుంది. కన్నీరు చుక్కలు చుక్కలుగా నేల మీద పడుతున్నవి.

"దొర కొడుకని వొదిలి పెట్టొద్దు. ఇయాల ఇది, రేపు ఇంకోటి "అంది అత్త.

దొర కొడుకనే సరికి గుసగుసలు బయలుదేరినవి. ఏదో చర్చ, ఏవేవో నిర్ణయాలు.

" ఏ దొరకొడుకు ? " ఖంగుమన్నది రాములు గొంతు ఆవేశంగా.

"ఇదో గోవు. ఏడవటం తప్పనోరిప్పదు " అంటూ చేయితో కోడల్ని చూపించింది అత్త.

అక్కడ వున్న దొరల గుండెల చూట్టూ కందిరీగలు ముసిరినట్టనిపించింది.

"మరి నీకెరికుంటే ఎవ్వరో సెప్పరాదూ ? "నాలుగైదు యువ గొంతులు అత్తనుద్దేశించి.

" సెపుతా ! ఎందుకు సెప్పను ? ఎంటేశ్వరావు కొడుకు " అక్కడే కూర్చున్న రావును చూపిస్తూ.

ఒక్కసారే పిడుగు పడినట్లనిపించింది వెంకటేశ్వర్రావుకి.

రాములు కళ్ళు రక్తాన్ని చిమ్ముతున్నవి. ఓసారి చుట్టూ చూశాడు.

"ఊరి నేలమని ఓట్లేసితే, నీ కొడుకు మంది ఆడోళ్ళను గుంజితే ఎట్ల దొరా ? " ఓ మధ్య వయస్కుని ప్రశ్న.

వెంకటేశ్వర్రావుకి నోట్లో తడి ఆరిపోయింది. చెమటలు కమ్ముకొని గొంతు పెగలటం లేదు.

"మీ ఆడోళ్ళు ఇండ్లలోనైరి. ఆల్లను ఎవ్వరూ గుంజరు. మరి మేము కల్లు అమ్ముకునేవాళ్ళమైతిమి. ఏదేదో బాధలతో వచ్చి కల్లు తాగుతరు. అపుడు మీతోటి ఈ మాట ఆ మాట మాట్లాడుతూ బావని, మావని, మరిదని మాట్లాడినంత మాత్రాన అందరూ రంకులాడాలా? కల్లు అమ్మేడు పోవాలని మంచిగ మాట్లాడితే లంజోల్లమా ? సెప్పుండ్రి, మీరే నాయం సెప్పుండ్రి ! " రొమ్ము చరుచుకుంటూ చుట్టూ తిరిగి అడుగుతుంది అత్త.

జనం ముసల్దాని ధైర్యాన్ని మెచ్చుకుంటున్నారు.

పంచాయితీలో కూర్చున్న పెద్దలు వెంకటేశ్వర్రావు వైపు చూసి -

" మీ కొడుకును పిలిపించండి " అన్నారు.

వెంకటేశ్వర్రావు వాళ్ళ మొహంలోకి చూశాడు. అందరూ తప్పదు అన్నట్టు చూశారు.

బరువైన శ్వాసను పీలుస్తూ మసుకూరి వైపు చూసి -

" నువ్వు కావలాయన వెళ్ళి వాన్ని తీసుకురండి " అన్నాడు.

ఇంతవరకు నేలమీద గీతలు గీసిన రాములు తన చేతిలోని కట్టెపుల్లను రెండుగ యిరిచి పారేసి, వెంకటేశ్వర్రావు వైపు చూశాడు.

అదే సంయంలో రాములు వైపు చూస్తున్న వెంకటేశ్వర్రావుకు తన కొడుకును రెండు ముక్కలుగా యిరిచినట్లనిపించి పెదరెడ్డి వైపు చూసి తల దించుకున్నాడు. చేతి కర్రతో మసుకూరి, కావలి వాడు గొంగళి సర్దుకుంటూ ఇదూ అక్కడినుండి కదిలారు.

"నాయం అనేది అందర్కీ సమానమేనా? ఏమన్నా భేదం ఉందా ? " అంటూ లేచి

నిల్చున్నాడు రాములు.

అందరూ అతని వైపు చూశారు.

వెంకటేశ్వర్రావూ అతని వైపు చూశాడు. తను కనిపిస్తే 'దండం దొరా ' అంటూ చేతులు జోడించే రాములు ఈ రోజు పంజా విప్పి పైకొస్తున్న పులిలా కనిపించాడు. కళ్ళు మూసి కణతలను ఎడమ చేతితో వత్తుకున్నాడు. అతని చేతిలోని కొడవలితో ముంజకాయలను నరికినట్టు కనిపించింది. వెంటనే కళ్ళు తెరిచి అటు ఇటూ చూసి కదిలి కూర్చున్నాడు. శరీరం అంతా చెమటతో తడిసింది.

రాములు కళ్ళలోని నిప్పు రాజుకొని మంటలు లేస్తున్నవి. అది గ్రహించిన కొందరు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"ఎవరు చేసినా తప్పు తప్పే ! తప్పున్నంక చికిత్స ఉండాలి గా ! దొర కొడుకైతేంది ? కూలోడి కొడుకైతేంది ? "

"ఇద్దరు అన్నవు కదా ! యింకొకడు ఎవరు ? ఆని పేరు సెప్పరు ? " అడిగారు అక్కడున్న యువకులు అత్తకోడళ్ళను ఉద్దేశిస్తూ.

"ఇంకొకడెవరు ? పెదరెడ్డి కొడుకు "అంది అత్త

పెదరెడ్డి ముఖం గాలి తీసిన ట్యూబులా అయిపోయింది. అందరూ పెదరెడ్డికేసి చూశారు.

తన వేపు చూస్తున్న వెంకటేశ్వర్రావుని చూశాడు పెదరెడ్డి.

ఊళ్లో సింహాల్లా తిరిగే వీళ్ళు సుడిగాలిలో చిక్కిన ఎండుటాకుల్లా అయిపోయారు.

" వాన్ని గూడా పట్టుకురండి " అనడంతో అక్కడున్న యువకులు కబడ్డీ ఆటలో కూత పెట్టేవాన్ని పట్టుకోవడానికి పోయినట్లు ఒక్కసారె జట్టుగా వెళ్ళారు.

అక్కడంతా గుసగుసలు ముసురుతున్నవి. కొందరు కళ్ళు పెద్దగా చేస్తే, మరికొందరు చెవులు పెద్దగా చేస్తున్నారు. ఆడవాళ్ళు మూతులు తిప్పుతూ ముక్కుమీద వేలేసుకుంటున్నారు.

"చూడుర్రి ! మీరు సికిత్స సేయకుంటే నేను కుండ బద్దలు కొడత. నలభయ్యేంఢ్ల నుండీ నా కడుపల దాగినయ్యన్నీ కక్కేస్తా. అప్పుడు సూడు ఎన్ని సంసారాలు గంగపాలు కావాల్నో " గుండె చరుసుకుంటూ అంది అత్త.

ఆ మాటలు వినగానే అక్కడున్న కొందరి ఆడవాళ్ళ నడికట్లు బిర్రై కొంగులు జారినవి. మగాళ్ళు కొందరు కదిలి సర్దుకుని కూర్చున్నారు. కొందరు చుట్టలు ముట్టించుకున్నారు. చడీ చప్పుడు లేదు. జండా కాడంతా నిశ్శబ్దం ఆవరించింది. తీసుకురావడానికి వెళ్ళిన మసుకూరి, కావాలాయనే కాకుండా ఆ నల్గురు యువకులు తిరిగొచ్చి " వాళ్ళు ఇండ్లలో లేరు " అన్నారు.

" ఆలెక్కడ వుంటరు ? ఉండరు దొరల కొడుకులైరి " పెదరెడ్డిని, వెంకటేశ్వర్రావును మార్చి మార్చి చూస్తూ అన్నాడు రాములు.

వాళ్ళు లేంది తీర్మానం ఎలా జరుగుద్దన్నట్లు ? అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారు.

" లేకుంటే ఎక్కడ పోతరు ? మందిండ్లకు నిప్పెట్టి మహరాజుల్లా కూర్చుంటెట్లా ? " దొరలంటే పడని వాళ్ళు ఉద్రేకంతో ఊగుతున్నారు.

" ఏదో తాగి అట్ల జేసిండ్రు గానీ అంతకు మించిన తప్పేం సెయ్యలేదు గదా!" దొరల సంక నాకేవోళ్ళు.

ఆ మాటలు విన్న అత్త " పేదోని పెండ్లాం అందరికీ మరదలు ! మీ ఇండ్లల్లో ఆడోళ్ళకు ఇట్ల జరిగితే ఊకుంటరా ? మీ ఆడోళ్ళందరూ పతివతలేనయే ! ఈ ఊరు సంగతి, వూళ్ళోళ్ల సంగతి నాకు బాగనే ఎరుక. ఏ తాటి కల్లు ఏ దొరసానికి ఏ జీతగాడు మోసిండో, ఏ జీతగాడు తాగిన పైకం కింద ఏ దొరసాని ఎన్ని గింజలు కొలిసిందో అన్నీ ఈ పొట్టలో వున్నయి. ఏతలప్పుడు, కోతలప్పుడు, నాట్లప్పుడు ఎవరెవరు ఎవరెవరికి కల్లు పోపిచ్చిండ్రో, ఎవరి పురుడు ఎవరు చేయించేదో చెపితే, ఎందరి పుటకలు బయట పడతయో చూడండ్రా ! " అంటూ ఊగిపోతున్న ముసలమ్మను ఓ అవ్వ చెట్టు కిందకు తీసకెళ్ళి కూర్చోబెట్టింది.

"నేరస్థులు లేరు కాబట్టి పంచాయితీని రేపటికి వాయిదా వేస్తున్నా "మని లేచారు గ్రామ పెద్దలు. ఓ పదేళ్ళ పిల్లవాడు వగరుస్తూ పరిగెత్తుకొచ్చి -

" ఆ ఇద్దరూ మా ఇంటి సందులనిచ్చి పోయి, అందం చేన్ల దాక్కుండ్రు" అంటూ తన ఎడమ చేతితో ఆముదపు చేను ఉన్న దిక్కును చూపించాడు.

" ఏదీ సూపిద్దువు పా " అంటూ ఊరెంబడే వున్న ఆముదపు చేనువైపు పరిగెత్తుతున్న రాములును అనుసరించారు అందరూ.

వెంకటేశ్వర్రావు, పెదరెడ్డి ఒకరినొకరు చూసుకుంటూ ఆలోచనలో పడ్డారు.

•